గంజాయి కట్టడిపై ప్రత్యేక దృష్టి

- ఆడపిల్లలపై అఘాయిత్యాలు, మద్యం, గంజాయి నిందితులను ఉపేక్షించొద్దు
- కూటమి నేతలు చెప్పినా విడిచిపెట్టకండి
- పోలీసులకు హోం మంత్రి అనిత ఆదేశం

-వార్త 7వ పేజీలో...

సమాజ సేవకులు

- మూడున్నర దశాబ్దాలుగా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సేవలు
- గ్రామాల్లో పర్యటించి గిరిజనులకు పలు అంశాలపై అవగాహన
- వైద్య శిబిరాలు, వ్యాధులపై సర్వేలు
- ప్రతి ఏడాది ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా నాలుగు వందల మంది గిరి విద్యార్థులు
- నేడు జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా..

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ద్వారా గత మూడున్నర దశాబ్దాలుగా విద్యార్థులు సేవలందిస్తున్నారు. గ్రామాల్లో పర్యటించి గిరిజనులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ, వ్యాధులపై సర్వేలు చేస్తున్నారు. విద్యార్థులు అంకితభావంతో సేవలు చేసేలా ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు తీర్చిదిద్దుతున్నారు. నేడు జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్ డే) దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.



వారపు సంతలో కల్తీ వస్తువులపై అవగాహన కార్యక్రమం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 1985లో స్థాపించగా 1990 నుంచే కళాశాలలో 'జాతీయ సేవా పథకం' యూనిట్‌ను నెలకొల్పారు. అప్పటి నుంచి నిర్విరామంగా కళాశాల విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కో యూనిట్‌లో వంద మంది విద్యార్థులుండేలా నాలుగు ఎన్ఎస్ఎస్ యూనిట్‌లను ఏర్పాటు చేసి ఒక్కో యూనిట్‌కు ఒక ప్రోగ్రామ్ ఆఫీసర్‌ను నియమించి, ప్రతి ఏడాది నాలుగు వందల మంది విద్యార్థులను ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా తయారు చేస్తున్నారు. పీవోలు జి.గౌరిశంకరరావు, జి.దామోదరరావు, వి.రమేశ్‌బాబు, డి.గణేశ్‌ల పర్యవేక్షణలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఏర్పడి స్థానికంగానే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని ఏర్పాటు చేసిన తరువాత నుంచి ప్రతి ఏడాది మూడుసార్లు డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి, రెడ్‌క్రాస్ సొసైటీకి అవసరమైన రక్తాన్ని అందిస్తున్నారు. ఇప్పటికి 320 యూనిట్‌ల రక్తాన్ని డిగ్రీ కళాశాల యాజమాన్యం అందించింది. దీంతో గత కలెక్టర్ సుమిత్‌కుమార్ డిగ్రీ కళాశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



గ్రామాల్లో ఇంటింటా సర్వే చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విస్తృతంగా సామాజిక కార్యక్రమాలు

ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు, వ్యాధులపై సర్వేలు చేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్ని దత్తత తీసుకుని అక్కడ సామాజిక సేవా కార్యక్రమాలు, పారిశుధ్య పనులు చేపట్టడం, మొక్కలు నాటడం వంటి చేస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర పథకాలు, అంటువ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరిస్తున్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌తో పాటు భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థుల్లో సేవా భావం పెంపునకు దోహదం



జాతీయ సేవా పథకంలో భాగంగా చేపట్టే కార్యక్రమాల ద్వారా గిరిజన విద్యార్థుల్లో సామాజిక అంశాలపై ప్రేరణకు ఎంతో దోహదపడతాయి. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా దృక్పథం పెంపొందించేందుకు అవకాశం కలుగుతున్నది. ప్రతి ఏడాది నాలుగు యూనిట్‌ల ద్వారా నాలుగు వందల మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తయారవుతున్నారు. ఎన్ఎస్ఎస్ పీవోల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నాం.

-డాక్టర్ వి.చిట్టిబ్బాయి, ప్రిన్సిపాల్, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ

మిరియాల ప్రయోగాత్మక సాగు ఫలప్రదం

అందుబాటులోకి మేలిరకం వంగడాలు

కేరళ నుంచి ఏడు రకాలు దిగుమతి

ఏడాదిన్నరకే దిగుబడులు ప్రారంభం

- హెచ్ఆర్ఎస్‌లో ఆర్థోట్రాక్ టెక్నాలజీతో మొక్కలు అభివృద్ధి
- ఈ ఏడాది రైతులకు పంపిణీ



మిరియాల మొక్కలు అభివృద్ధి చేస్తున్న పాలిహౌస్

చింతపల్లి, సెప్టెంబరు 23: జిల్లాలోని ఆదివాసీ రైతులకు మేలిరకం మిరియాల వంగడాలు (మొక్కలు) అందుబాటులోకి రానున్నాయి. నాట్లు వేసిన ఏడాదిన్నరకే దిగుబడులు ప్రారంభమయ్యే విధంగా ఆర్థోట్రాక్ టెక్నాలజీ ద్వారా ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మొక్కలను అభివృద్ధి చేశారు. తెగుళ్లు, చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే ఏడు రకాల వంగడాలను స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం (హెచ్ఆర్ఎస్) శాస్త్రవేత్తలు కేరళ నుంచి 2021 మార్చిలో తీసుకొచ్చారు. మూడేళ్లగా పాలిహౌస్‌లో ప్రయోగాత్మక సాగు చేపడుతున్నారు. శాస్త్రవేత్తల ప్రయోగాత్మక సాగు విజయవంతం కావడంతో ఈ ఏడాది రైతులకు ఈ నూతన రకం మొక్కలు పంపిణీ చేసేందుకు శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో ఆదివాసీ రైతులు కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాలు పండిస్తున్నారు. పాడేరు డివిజన్ పరిధిలో 98 వేల ఎకరాల్లో మిరియాల పంటను సాగు చేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో మిరియాలు ద్వితీయ వాణిజ్యపంటగా గుర్తింపు పొందింది. కేరళ ప్రాంత రైతులు ఎకరానికి 2.5 నుంచి 3 టన్నుల ఎండు మిరియాలు దిగుబడి సాధిస్తున్నారు. గిరిజన ప్రాంత రైతులు 1.5 టన్నులకు మించి దిగుబడి సాధించలేకపోతున్నారు. మార్కెట్‌లో మిరియాలు కిలోకి రూ.550- 600 ధర పలుకుతోంది. దీంతో గిరిజన ప్రాంత రైతులకు మేలిరకం వంగడాలను అందించాలనే లక్ష్యంతో వెంకటరామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు సహకారంతో స్థానిక పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రారంభించారు. ఈ ప్రయోగాత్మక సాగు విజయవంతం కావడంతో రైతులకు మొక్కల పంపిణీకి శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆర్థోట్రాక్ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు (ఫైల్ ఫొటో)

కేరళ నుంచి ఏడు రకాలు దిగుమతి

కేరళ(కాలికట్) ఉద్యాన పరిశోధన స్థానం నుంచి చీడపీడలు, తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడినిచ్చే మేలిరకం ఏడు రకాల వంగడాలను స్థానిక శాస్త్రవేత్తలు దిగుమతి ... మిగతా 8వ పేజీలో

ఈ ఏడాది రైతులకు మొక్కలు పంపిణీ



ఈ ఏడాది ఆర్థోట్రాక్ టెక్నాలజీ ద్వారా అభివృద్ధి చేసిన మొక్కలను రైతులకు నామమాత్రపు ధరకు పంపిణీ చేస్తాం. కేరళ నుంచి దిగుమతి చేసుకున్న ఏడు రకాలు గిరిజన ప్రాంతానికి అనుకూలమైనవిగా గుర్తించాం. ఈ నూతన రకాలు తెగుళ్లను తట్టుకుని ఎకరానికి మూడు టన్నుల ఎండు మిరియాల దిగుబడినిస్తుంది. రానున్న రోజుల్లో ఏజెన్సీలో ఈ ఏడు రకాలు విస్తరణకు చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ శివ కుమార్, అధిపతి, శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోన స్థానం, చింతపల్లి

నేడు మంత్రి లోకేశ్ విశాఖ రాక

25న ఐటీ కంపెనీల ప్రతినిధుల సమావేశానికి హాజరు

అనంతరం రుషికొండ ఐటీ పార్కు సందర్శన



విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం రాత్రి నగరానికి రానున్నారు. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి రాత్రి 8.40 గంటలకు బయలుదేరి 9.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి రాత్రి 10.10 గంటలకు సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేస్తారు. ఈనెల 25వ తేదీన దేశంలో ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులతో నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించే సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. అనంతరం రుషికొండ ఐటీ పార్కును సందర్శించి అక్కడ ఉద్యోగులు, నిపుణులతో భేటీ అవుతారు. బుధవారం రాత్రి తిరిగి విజయవాడ వెళతారు.



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ దినేశ్‌కుమార్, కమిటీ సభ్యులు

సత్వరమే అట్రాసిటీ కేసుల పరిష్కారం

అధికారులకు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించి, బాధితులకు తగిన న్యాయం చేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన అట్రాసిటీ కేసుల జిల్లా విజిలెన్స్ అండ్ మానెటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా కేసుల్లోని బాధితులకు పరిహారం అందించడంలో జాప్యం చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 2022 నుంచి 2024 వరకు పాడేరు పోలీస్ డివిజన్ పరిధిలో 12, చింతపల్లిలో 12, రంపచోడవరంలో 19, చింతూరు డివిజన్‌లో 9 కేసులు నమోదయ్యాయన్నారు. ఇప్పటి వరకు 11 కేసులకు రూ.11 లక్షల 35 వేలు పరిహారం అందించారని, చార్జిషీటు వేసిన 4 కేసులకు రూ.2 లక్షల 50 వేలు చెల్లించారన్నారు. విశాఖపట్నం, కాకినాడ జిల్లాల కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించిన కేసులను ఇక్కడికి బదిలీ చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

అలాగే గత మూడేళ్ల నుంచి ఎన్ని కేసులను పరిష్కరించారు?, ఇంకా ఎన్ని కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎన్ని కేసులకు అదనపు పరిహారం చెల్లించాలనే దానిపై ఆరా తీశారు. భూ తగాదాల విషయంలో అసలైన హక్కుదారులు ఎవరో గుర్తించి త్వరతగతిన వాటిని పరిష్కరించాలని ఆయన సూచించారు. అత్యాచారం, హత్యలు జరిగిన కేసులకు భూమిని మంజూరు చేయాలని, ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోతే భూమిని కొనుగోలు చేసి బాధిత కుటుంబాలకు అందించాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఐటీడీఏ పీవోలకు సూచించారు. విద్యార్థులు సెలవులకు వెళ్లి తిరిగి పాఠశాలలకు వచ్చేటప్పుడు విధిగా ... మిగతా 8వ పేజీలో

గిరి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

-వార్త 8వ పేజీలో...



పీహెచ్‌సీలో వైద్యం కోసం బారులుతీరిన రోగులు

వైద్య సేవలు నామమాత్రమే..

- ఇంకా సమ్మెలోనే వైద్యులు
- సాధారణ వైద్యం స్టాఫ్ నర్సులతో కొనసాగింపు
- అత్యవసర వైద్యానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలింపు



ఖాళీగా ఉన్న రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సీటు

కొయ్యూరు, సెప్టెంబరు 23: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు నామమాత్రంగానే అందుతున్నాయి. జీవో నంబరు 85ను వ్యతిరేకిస్తూ ఈ నెల 17వ తేదీ నుంచి వైద్యులు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వైరల్ జ్వరాలు విజృంభిస్తుండడంతో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైద్యులు లేకపోవడంతో స్టాఫ్ నర్సులు సేవలందిస్తున్నారు. అత్యవసర కేసులు వస్తే చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఈ పరిస్థితి మండలంలోని నాలుగు పీహెచ్‌సీలతో పాటు పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని 66 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలకొంది. వ్యయప్రయాసలకు ఓర్చి చిన్నారుల జనన ధ్రువీకరణ పత్రాలకు సోమవారం పీహెచ్‌సీకి వచ్చిన బాలింతలు వైద్యులు విధులకు హాజరుకాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. మెరుగైన వైద్యం అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




సీలేరు వచ్చిన పాడేరు- డొంకరాయి బస్సు

ఎట్టకేలకు బస్సుల పునరుద్ధరణ

15 రోజుల తరువాత రాకపోకలు

సీలేరు, సెప్టెంబరు 23: జీకేవీధి మండలం సీలేరుకు ఎట్టకేలకు 15 రోజుల తరువాత బస్సు వచ్చింది. ఈ నెల 8వ తేదీన బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో జీకేవీధి మండలంలో కొండచరియలు, చెట్లు విరిగి పడడంతో పాటు సంపంగిగొంది, లంకపాకల మధ్య రెండు వంతెనలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీంతో జీకేవీధి, సీలేరు మధ్య బస్సుల రాకపోకలు ఈ నెల 9వ తేదీ నుంచి నిలిచిపోయాయి. విరిగిపడిన కొండచరియలు, చెట్లు తొలగించినప్పటికీ వంతెనల మరమ్మతులు పూర్తి కాకపోవడంతో బస్సుల రాకపోకలకు ఆర్‌అండ్‌బీ అధికారులు అనుమతి ఇవ్వలేదు. అయితే సోమవారం నాటికి బలహీనపడిన రెండు వంతెనల కింద ఐరన్ సపోర్టులు ఏర్పాటు చేసి కాంక్రీట్ పనులను పూర్తి చేయడంతో బస్సుల రాకపోకలకు ఆర్ అండ్ బీ అధికారులు అనుమతించారు. దీంతో పాడేరు డిపోనకు చెందిన పాడేరు- డొంకరాయి బస్సు సోమవారం రాత్రి ఏడుగంటలకు సీలేరు రావడంతో ఈ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేశారు.



జడ్పీలో బదిలీలు

ఉమ్మడి జిల్లాలో 154 మందికి స్థానచలనం

- జాబితాలో 29 మంది ఎంపీడీవోలు...
- 10 మంది ఎంపీడీవోలు కొనసాగింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

విశాఖ జిల్లా పరిషత్ పరిధిలో ఎంపీడీవో నుంచి అటెండర్ వరకు మొత్తం 154 మందికి సోమవారం బదిలీ అయ్యింది. ఈ జాబితాలో 29 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో) ఉన్నారు. బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లా నుంచి తొమ్మిది మంది ఇతర జిల్లాలకు వెళ్లగా, ఇతర జిల్లాల నుంచి పది మంది ఎంపీడీవోలు వచ్చారు.

తాజా బదిలీల్లో భాగంగా ఆనందపురం ఎంపీడీవో ఎ.లవరాజును అరకులోయ బదిలీ చేసి, ఆయన స్థానంలో భీమిలి ఎంపీడీవో వి.జానకిని నియమించారు. నాతవరం ఎంపీడీవో ఎన్.హనుమంతురావును భీమిలి బదిలీ చేశారు. అచ్యుతాపురం ఎంపీడీవో వి.విజయలక్ష్మిని బుచ్చెయ్యపేట బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న ఎంపీ సువర్ణరాజును దేవరాపల్లి మార్చారు. ఇప్పటివరకూ దేవరాపల్లిలో పీఆర్‌ఏఈ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు.

అదేవిధంగా చీడికాడ ఎంపీడీవో ఎ.జయప్రకాశరావును పాయకరావుపేట బదిలీ చేసి, ఆయన స్థానంలో పరవాడ ఎంపీడీవో వి.హేమసుందరరావును నియమించారు. చోడవరం నుంచి ఎస్‌డీ శ్యామ్‌సుందర్‌ను పరవాడ బదిలీ చేసి, కొత్తగా వచ్చిన పీవీఎస్‌జే ఆంజనేయులుకు చోడవరం ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. గొలుగొండలో పనిచేస్తున్న ఎస్.డేవిడ్‌రాజును ఎస్.రాయవరం బదిలీ చేసి, ఆయన స్థానంలో కొయ్యూరు ఎంపీడీవో ఎ.మేరీ రోజ్‌ను నియమించారు. ఆమె స్థానంలో సబ్బవరంలో పనిచేస్తున్న బి.రమేష్‌నాయుడును నియమించి కొత్తగా వచ్చిన పద్మజకు సబ్బవరం ఎంపీడీవోగా పోసింగ్ ఇచ్చారు. నక్కపల్లి ఎంపీడీవో మరో జిల్లాకు బదిలీ కాగా అక్కడ కార్యాలయ సూపరింటెండెంట్ డి.సీతారామరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నర్సీపట్నం ఎంపీడీవో ఎం.జయమాధవిని రాంబిల్లి, అక్కడ ఉన్న కేఎస్ కొండలరావును ఎలమంచిలి బదిలీ చేశారు. ఎలమంచిలి ఎంపీడీవో కె.అప్పలనాయుడు వేరే జిల్లాకు బదిలీపై వెళ్లారు. రోలుగుంట ఎంపీడీవో కె.ప్రభాకరరావును ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

మూడు కిలోల గంజాయితో యువకుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23: గంజాయి రవాణా చేస్తున్న స్థానిక సత్యనారాయణపురం పంచాయతీ సుబ్రహ్మణ్య కాలనీకి చెందిన నీలగిరి హరీష్‌ను సోమవారం రామాపురం కాలనీ వద్ద అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. హరీష్ అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లు కట్టి అమ్మకాలు చేస్తున్నాడని ఆయన చెప్పారు. దీంతో అతని కదలికలపై నిఘా వుంచామని, సోమవారం ఏజెన్సీ నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయితో వస్తున్నట్టు సమాచారం అందిందని పేర్కొన్నారు. రామాపురం కాలనీ వద్ద నిఘా వేసి, హరిష్‌ను అరెస్టు చేసి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ద్విచక్ర వాహనం, రూ.1700 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

సెక్యూరిటీ ఉద్యోగి మృతి

▸▸ కంపెనీ గేటు ముందు మృతుని బంధువుల ఆందోళన

రాంబిల్లి, సెప్టెంబరు 23: ప్రత్యేక ఆర్థిక మండలి(ఎస్ఈజెడ్)లోని నెరోలాక్ కంపెనీలో సెక్యూరిటీగా పనిచేస్తూ కడుపునొప్పికి గురైన సీహెచ్.నూకరాజు(28) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలంటూ రాత్రి సుమారు 7:30 గంటల ప్రాంతంలో బంధువులు కంపెనీ గేటుముందు మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. కంపెనీలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే నూకరాజుకు కడుపునొప్పి వచ్చిందని, అందువల్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎస్ఐ నాగేంద్రను వివరణ కోరగా.. నెరోలాక్ కంపెనీలో సెక్యూరిటీగా పనిచేస్తున్న నూకరాజు ఈ నెల 21న విధులు నిర్వహిస్తున్న సమయంలో కడుపునొప్పి రావడంతో కేజీహెచ్‌కు తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడన్నారు. నూకరాజు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

క్రైస్తవులపై దాడులకు నిరసన



కలెక్టరేట్ ముందు బైఠాయించిన క్రైస్తవ సంఘాల నాయకులు

తుమ్మపాల (అనకాపల్లి), సెప్టెంబర్లు 23: ఎలమంచిలిలో ఇటీవల క్రైస్తవులపై జరిగిన దాడులకు నిరసనగా సోమవారం క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా క్రైస్తవ ప్రగతి పరిరక్షణ సమాఖ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు వీకే జేమ్స్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ కేబీకే పీటర్ మాట్లాడుతూ.. ప్రపంచానికి శాంతిని పంచే క్రైస్తవ సమాజంపై మతోన్మాదులు దాడులకు పాల్పడడం అన్యాయమన్నారు. పోలీసులు ఒక వర్గానికి కొమ్ము కాయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు పండ్రాన తిమోతి, బి.యోహాను, క్రాంతి పాల్, కిరణ్‌కుమార్, కేపీడీఆర్ ప్రసాద్, జాన్సన్, బెనర్జి, ప్రమోద్‌కుమార్, ఎం.సాల్మన్‌రాజు, సీహెచ్.రాజు, ఎం.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా డీఎస్ఎన్ఎల్‌యూ వ్యవస్థాపక దినోత్సవం



ప్రసంగిస్తున్న విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

సబ్బవరం, సెప్టెంబరు 23: సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) 17వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, వర్సిటీ నలుగురు విద్యార్థులతో ప్రారంభమైందని, అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం వెయ్యి మందికిపైగా విద్యార్థులు వున్నారని చెప్పారు. 12 రీసెర్చ్ సెంటర్స్, ఐపీఆర్ చైర్ వంటి అనేక అంశాలు, కార్యక్రమాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుందన్నారు. విశ్వవిద్యాలయం పురోగతిలో టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్ర నాథ్ మాదాసు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న జిల్లా ఎస్పీ



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని హారతి స్వీకరిస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 : స్థానిక నూకాంబిక అమ్మవారిని సోమవారం జిల్లా ఎస్పీ ఎం.దీపిక దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి వచ్చిన ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. బాలాలయంలో అమ్మవారికి ఎస్పీ పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఎస్పీని ఆశీర్వదించారు. ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ఎంకే జోగినాయుడు అమ్మవారి చిత్రపటాన్ని ఎస్పీకి అందజేశారు.

ఈ-కంటెంట్ రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా దొర



ఉపాధ్యాయుడు సీహెచ్ఎస్ దొర

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 23: ఈ-కంటెంట్ రాష్ట్రస్థాయి రిసోర్సు పర్సన్‌గా మండలంలోని వెంకటనగరం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సిహెచ్.ఎస్.దొర ఎంపికైనట్టు ఎంఈవో కె.ఎస్.గాంధీ తెలిపారు. కేంద్ర సాంకేతిక విద్యా సంస్థ (సీఐఈటీ), కేంద్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ-న్యూఢిల్లీ) ఆధ్వర్యంలో ఈ-కంటెంట్ అభివృద్ధి కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్‌గా ఎంపికచేసి వారికి ఆన్‌లైన్ శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఏపీ నుంచి ఎంపిక చేసిన 20 మంది ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణలో ఇస్తారన్నారు. వీరిలో పాయకరావుపేట మండలం వెంకటనగరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సిహెచ్.ఎస్.దొర వున్నారని ఎంఈవో వెల్లడించారు. దొర ప్రస్తుత 1వ తరగతి నుంచి 5వ తరగతి ప్రాథమిక స్థాయికి సంబంధించిన ఆంగ్ల పాఠ్య పుస్తక రచయిత అని, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా దీక్ష కో-ఆర్డినేటర్‌గా సేవలందిస్తున్నారన్నారు. ఈ-కంటెంట్‌లో భాగంగా 4వ తరగతి ఇంగ్లిష్‌కు సంబంధించి రూపొందించిన వీడియోలు ఏపీ ఈ-పాఠశాల యాప్‌నందు పొందు పరిచానని, ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకుని చక్కని ఈ-కంటెంట్ రూపకల్పనకు కృషి చేస్తానని ఉపాధ్యాయుడు దొర తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

గంజాయి కట్టడిపై ప్రత్యేక దృష్టి

- ఆడపిల్లలపై అఘాయిత్యాలు, మద్యం, గంజాయి నిందితులను ఉపేక్షించొద్దు
- కూటమి నేతలు చెప్పినా విడిచిపెట్టకండి
- పోలీసులకు హోం మంత్రి అనిత ఆదేశం
- 'పేట నియోజకవర్గంలో 20 రోజుల్లో మెగా జాబ్ మేళా
- ప్రజల సమస్యలపై ఫిర్యాదుల పెట్టెలు



'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, సెప్టెంబరు 23: ఆడ పిల్లల మీద అఘాయిత్యాలు, గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా నేరాల్లో పట్టుబడిన నిందితులను కూటమి నాయకులు చెప్పినా వదలొద్దని హోం మంత్రి వంగలపూడి అనిత పోలీసులను ఆదేశించారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ, వైసీపీ పాలనలో గంజాయి సాగు, రవాణా విపరీతంగా పెరిగిపోయాయని, చిన్న పిల్లలు సైతం గంజాయి మత్తుకు బానిసలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడా గంజాయి ఆనవాళ్లు వుండకూడదని, దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె ఆదేశించారు.

పాయకరావుపేట నియోజకవర్గం ప్రజలు తనను భారీ మెజారిటీతో గెలిపించారని, దీంతో నియోజకవర్గం అభివృద్ధి విషయంలో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే పలు హామీలను అమలు చేశామని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను వెయ్యి రూపాయలు పెంచామని, ల్యాండ్ టైటిలింగ్ చట్టాలన్ని రద్దు చేశామని, అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామని, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని ఆమె చెప్పారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాజధాని అమరావతి అభివృద్ధి కోసం రూ.15 వేల కోట్లు మంజూరు చేసేలా కృషి చేశారని మంత్రి అనిత చెప్పారు. గత సీఎం జగన్‌రెడ్డి తన కేసుల మాఫీ కోసం తరచూ ఢిల్లీ వెళ్లగా, చంద్రబాబు రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టుల కోసం ఢిల్లీ వెళుతున్నారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరిపాలనలో తనదైన ముద్ర వేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఒకేరోజు యగ్రామ సభలు నిర్వహించి రికార్డు సృష్టించారని కొనియాడారు.

20 రోజుల్లో మెగా జాబ్ మేళా

నిర్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం పలు పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి, ఇరవై రోజుల్లో నియోజకవర్గంలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేయిస్తానని మంత్రి అనిత హామీ ఇచ్చారు. మండలంలో వివిధ ప్రాంతాల్లో ఐదుచోట్ల ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేయిస్తున్నానని, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలు, ఫిర్యాదులను ఈ పెట్టెల్లో వేయాలని కోరారు. ఫిర్యాదిదార్ల పేర్లను గోప్యంగా వుంచుతామని, ఒకవేళ ఫిర్యాదు చేసిన వారి పేరు బయటకు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

వైసీపీ హయాంలో తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించిన విషయం బయటపడడంతో భక్తులు తీవ్ర ఆవేదన చెందారని, శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన జగన్‌రెడ్డికి గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని అనిత అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, తహసీల్దార్ విజయకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు,జనసేన, బీజేపీ నాయకులు తోట నగేశ్, రవిరాజు, గెడ్డం బుజ్జి, అమలకంటి అబద్ధం, వెంకటరాజు, నవీన్‌రాజు, అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ, పల్లెల బుజ్జి, భీమరశెట్టి శ్రీనివాసరావు, సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన

- అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, సెప్టెంబరు 23: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్నామని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెంలో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీకి రూ.6.48 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. దీపావళి నుంచి అర్హులైన మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నట్టు తెలిపారు. మండలంలో డ్రైనేజీల నిర్మాణానికి లచ్చన్నపాలెం గ్రామానికి రూ.2.45 కోట్లు, పైడిపాల గ్రామానికి రూ.2.8 కోట్లు, జి.కోడూరు గ్రామానికి రూ.1.29 కోట్లు మంజూరు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పలు హామీలను నెరవేర్చిందన్నారు. రోలుగుంట మండలంలో ఓ ప్రైవేటు వైద్యాధికారి మత్తు ఇవ్వకుండానే ఆపరేషన్లు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, వెంటనే ఆ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డీవో జయరాంను ఆదేశించారు. అనంతరం ఐసీడీ ఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, మహిళలకు సీమంతాలు నిర్వహించారు.

ప్రజల సొమ్ముతో విశాఖ డెయిరీ యాజమాన్యం జల్సా

రైతుల సొమ్ముతో విశాఖ డెయిరీ పాలకవర్గం జల్సా చేస్తోందని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. సొసైటీ సొమ్ముతో షీలానగర్‌లో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో రైతులకు నామమాత్రపు చికిత్సలు చేస్తున్నారని విమర్శించారు. రైతుల పిల్లలకు ఇంజనీరింగ్ చదువు పేరుతో ఎలమంచిలిలో కొనుగోలు చేసిన స్థలాన్ని అమ్మేశారన్నారు. ఇటీవల పాల సంఘాల అధ్యక్షులకు డెయిరీలో సమావేశం నిర్వహించి 4 గ్రాముల చొప్పున బంగారం ఇచ్చారని, అందుకు సంబంధించి సొసైటీల నుంచి రూ.39,100 చొప్పున రైతుల సొమ్ము తీసుకున్నారని ఆరోపించారు.

రెండు సంవత్సరాలుగా రైతులకు బోనస్ ఇవ్వడం లేదన్నారు. ఈ వ్యవహారంపై రైతులు ముందుకు రావాలని, అవసరమైతే డెయిరీ చైర్మన్‌ను మారుస్తామని స్పష్టం చేశారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో డెయిరీపై చర్చిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతల రామలక్ష్మి, ఆర్‌డీవో జయరాం, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, జనసేన నాయకుడు సూర్యచంద్ర, టీడీపీ నాయకులు పోతల అప్పలనాయుడు, పోతల రాంబాబు, అల్లు రామునాయుడు, శేషుకుమార్ పాల్గొన్నారు.

తహసీల్దారు బదిలీల్లో సిఫారసులకే పెద్దపీట!

- ఏజెన్సీలో పోస్టింగ్స్‌కు సంబంధించి నిబంధనలు పట్టించుకోలేదని విమర్శలు
- డీటీల బదిలీల్లోనూ అదే తంతు
- కోర్టుకు వెళ్లేందుకు పలువురి సిద్ధం

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు బదిలీల్లో ప్రజా ప్రతినిధుల సిఫారసులకే పెద్దపీట వేశారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలో పోస్టింగ్స్‌కు సంబంధించి నిబంధనలు (50 ఏళ్లు దాటిన వారిని ఏజెన్సీకి బదిలీ చేయకూడదు) పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దారు బదిలీల్లో విశాఖ జిల్లా నుంచి ఒక్కరినే పంపుతామని సంకేతాలు ఇచ్చిన అధికారులు దానినే అమలుచేశారు. అది కూడా ఎన్నికల తరువాత విశాఖ కలెక్టరేట్‌లో పోస్టింగ్ ఇచ్చినా విధుల్లో చేరని శ్యామ్‌కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపారు. శ్యామ్‌కుమార్ వయస్సు రమారమి 60 సంవత్సరాలు. ఆయన కంటే వయస్సులో చిన్నవారైన అధికారులను విశాఖ జిల్లాలోనే కొనసాగించారు. అలాగే ఏజెన్సీలో పనిచేస్తూ విశాఖ జిల్లాకు ఆప్షన్ పెట్టుకున్న ఏడుగురిలో నలుగురిని విశాఖ, అనకాపల్లి బదిలీ చేసి, మిగిలిన ముగ్గురిని...తిరుమలరావు (61 సంవత్సరాలు), నాగరాజు (55 ఏళ్లు), చిన్నకృష్ణ (52 ఏళ్లు) అక్కడే ఉంచారు. వీరు ముగ్గురు ఏజెన్సీలో రెండేళ్లకు మించి పనిచేస్తున్నారు. విశాఖ జిల్లాలో జూనియర్లను కొనసాగించారు. వీరిలో కొందరు ఏజెన్సీలో ఒక్కరోజు కూడా పనిచేయలేదు. అయితే సంఘ నేతలని ఒకరిద్దరని, ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల కారణంగా మరికొందరిని బదిలీల నుంచి మినహాయించారు. రెండు నెలల క్రితం తహసీల్దార్ల పోస్టింగ్స్‌లో ముగ్గురి, నలుగురి విషయంలో వివాదాలు చేలరేగినప్పుడు వారిలో కనీసం ఇద్దరు లేదా ముగ్గురికి స్థానచలనం ఉంటుందని భావించారు. అయితే సిఫారసులు బాగా పనిచేయడంతో వారి జోలికి వెళ్లలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా రెండు నెలల క్రితం బదిలీల్లో ఇద్దరికి తగిన ప్రాధాన్యం ఉన్న మండలాలు దొరకలేదు. వారిరువురూ తమకున్న పలుకుబడిని ఉపయోగించుకుని అనకాపల్లి జిల్లాకు వెళ్లిపోయారు. వీరిరురూ 50 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారే. ఇదిలావుండగా బదిలీల్లో అన్యాయం జరిగిందని భావిస్తున్న కొందరు తహసీల్దార్లు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. కాగా 40 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 55 మంది సీనియర్ అసిస్టెంట్లు, 14 మంది జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. డిప్యూటీ తహసీల్దార్లను కూడా నగరం, దానికి ఆనుకుని మండలాల్లో అటుఇటుగా సర్దేశారు తప్ప ఏజెన్సీకి బదిలీ చేయలేదు. విశాఖ ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పనిచేసే సూర్యకళ (53 సంవత్సరాలు)ను ఏజెన్సీకి బదిలీ చేయడంపై రెవెన్యూ వర్గాల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. యువకులకు కాదని 50 ఏళ్లు దాటిన ఒంటరి మహిళను ఏజెన్సీకి పంపడం సమంజసం కాదనే వాదన వినిపిస్తోంది.

గాజువాక మునిసిపల్ మాజీ చైర్మన్ వీవీఎన్ఎం రాజా హఠాన్మరణం



వీవీఎన్ఎం రాజా (ఫైల్)

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 23: గాజువాక మునిసిపల్ మాజీ చైర్మన్ వీవీఎన్ఎం రాజా (57) సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన యువజన కాంగ్రెస్ నాయకుడిగా, కార్పొరేటర్‌గా, గాజువాక మునిసిపాలిటీగా ఉన్నప్పుడు వైస్ చైర్మన్‌గా, చైర్మన్‌గా పనిచేశారు. 2004కు ముందు గాజువాక మునిసిపల్ చైర్మన్‌గా ఉన్న తిప్పల గురుమూర్తిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో, ఆ స్థానంలో రాజా ఎన్నికై ఏడాదిపాటు పనిచేశారు. అనంతరం గాజువాక మునిసిపాలిటీ జీవీఎంసీలో విలీనం అయ్యింది. రాజా కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి మారిన రాజా 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైసీపీలో చేరారు. గుండెకు సంబంధించిన సమస్య తలెత్తడంతో కొన్నేళ్ల క్రితం బైపాస్ సర్జరీ చేయించు కున్నారు. సోమవారం సాయంత్రం గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కూర్మన్నపాలెంలోని ఏప్లస్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాజా మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన భౌతికకాయాన్ని టోల్‌గేటు సమీపంలో గల శివాజీనగర్‌లోని స్వగృహానికి తరలించారు. రాజాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజా మృతికి పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నాయకులు సంతాపం తెలిపారు.

కల్తీ నెయ్యి కారకులను కఠినంగా శిక్షించాలి

- హిందూ దేవాలయ పరిరక్షణ సమితి డిమాండ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23: తిరుమల శ్రీవారి లడ్డూని అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హిందూ దేవాలయ పరిరక్షణ సమితి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి కొణతాల అప్పలరాజు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం స్వామి వారి లడ్డూ తయారీకి స్వచ్ఛమైన నెయ్యి కాకుండా జంతువుల కొవ్వు, నూనెలను ఉపయోగించిందని, ఈ విషయం తెలుసుకున్న భక్తులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని అన్నారు. కల్తీ నెయ్యి వినియోగంపై కూటమి ప్రభుత్వం లోతుగా విచారణ జరిపి, సాక్ష్యాధారాలను బయటపెట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట హిందూ దేవాలయ పరిరక్షణ సమితి నిరసన

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
- ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో 401 వినతులు

తుమ్మపాల, సెప్టెంబరు 23: ఒకే సమస్యపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ఫిర్యాదులు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పలువురు ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో అందుతున్న ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 401 వినతులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 68 ఫిర్యాదులు

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 68 ఫిర్యాదులు అందినట్టు జిల్లా ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలకు సంబంధించి అధిక ఫిర్యాదులు అందాయని, చట్ట పరిధిలో వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

కారిడార్ నిర్వాసితులకు గ్రీవెన్స్ సెల్



గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు ఇవ్వడానికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కారిడార్ నిర్వాసిత రైతులు

- రైతుల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరణ
- తొమ్మిది గ్రామాల నుంచి 532 మంది దరఖాస్తు



వినతులకు పరిశీలిస్తున్న ఆర్‌డీవో జయరాం

నక్కపల్లి, సెప్టెంబరు 23: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలో భూములు ఇచ్చిన రైతుల సమస్యలు తెలుసుకోవడానికి కలెక్టర్ ఆదేశాలతో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద స్పెషల్ గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. నర్సీపట్నం ఆర్డీవో జయరాం, తహసీల్దార్ అంబేడ్కర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సెల్‌లో చందనాడ, మూలపర్ర, అమలాపురం, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట, పాటిమీద, డీఎల్‌పురం, వేంపాడు, బోయపాడు గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు నష్టపరిహారం, ప్యాకేజీ ఇతర సమస్యల గురించి వినతులు, ఫిర్యాదులు అందజేశారు. మొత్తం 532 ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ చెప్పారు. అత్యధికంగా చందనాడ నుంచి 216 వినతులు, మూలపర్ర నుంచి 110 వినతులు అందాయి. కారిడార్ భూముల్లో సర్వేకు నిర్వాసిత రైతులు సహకరించాలని ఆర్డీవో జయరాం కోరారు.

జిల్లా పశు సంవర్థక శాఖ అధికారిగా రామ్మోహన్‌రావు

అనకాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పశు సంవర్థక శాఖ అధికారిగా డాక్టర్ రామ్మోహన్‌రావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లా అధికారిగా పనిచేసిన బి.ప్రసాదరావు విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు.

బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విశాఖపట్నం, సెప్టెంబరు 23 : దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా పేలుళ్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలను డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది రేంజ్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు జరిపే వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అనుమతి ఉన్న గోడౌన్లు, షాపులు వద్ద భద్రతా ప్రమాణాలు సరిగ్గా ఉన్నది లేనిది పరిశీలించాలన్నారు. అనధికారంగా వ్యాపారాలు చేసేవారిని గుర్తించి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయాలని ఆదేశించారు.

టీచర్ తీరుపై ప్లస్ 2 బాలికల నిరసన

ఎలమంచిలి, సెప్టెంబరు 23: పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక ఉపాధ్యాయురాలి తీరును నిరసిస్తూ ప్లస్ 2 (ఇంటర్) విద్యార్థినులు సోమవారం తరగతులు బహిష్కరించి పాఠశాల ఆవరణలో ఆందోళన చేశారు. పాఠాలు సరిగా చెప్పడంలేదని, సిలబస్ పూర్తి చేయకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారని, అసభ్యకరంగా మాట్లాడుతున్నారని బాలికలు ఆరోపించారు. ఈ సమస్యను ఎస్ఎఫ్ఐ ప్రతినిధుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోక పోవడంతో తరగతులు బహిష్కరించి నిరసన తెలిపామన్నారు. కాగా ఉన్నతాధికారులు విచారణ జరిపించి, సదరు ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రతినిధి మణికంఠ, కేశవ, రవి, రాము లక్ష్మణ్, పావని, భవానీ తదితరులు పాల్గొన్నారు.


సంకాడలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఈశ్వరి

సంక్షేమం, అభివృద్ధికి సీఎం చంద్రబాబు పెద్దపీట

- సీలేరు రహదారి నిర్మాణానికి నిధుల విడుదల
- టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 23: గిరిజన గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద పీట వేస్తున్నారని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని సంకాడ గ్రామ పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వాతాతలకు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ బకాయిలు అందజేశారన్నారు. విజయవాడలో వరదల నుంచి ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు బస్సులోనే బస చేసి నిర్విరామంగా శ్రమించిన ఏకైన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అధిక వర్షాలకు ధ్వంసమైన సీలేరు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, వరదల వల్ల గృహాలు నష్టపోయిన 144 మందికి పరిహారం అందించారని, పీవీటీజీలకు జీకే వీధిలో 1,247 పక్కా గృహాలు మంజూరయ్యాయని ఆమె వివరించారు. అలాగే పాడేరు జిల్లా కేంద్రంలో అన్నా క్యాంటీన్ మంజూరైందని, ఇందుకోసం స్థల పరిశీలన జరుగుతున్నదని చెప్పారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఎస్.ఆనందరావు, ఎంపీటీసీ సభ్యురాలు పి.నాగమణి, నాయకులు కె.రమేశ్‌నాయుడు, బొర్ర విజయరాణి, కిట్లంగి పద్మ, ముక్కలి రమేశ్, ఎం.నాగేంద్ర, బి.చిరంజీవి, సాగిన బాలరాజు, రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, అర్జున్, నాగభూషణం పాల్గొన్నారు.

వంద రోజుల పాలనపై ప్రజల్లో సంతృప్తి: జ్ఞానేశ్వరి

చింతపల్లి, సెప్టెంబరు 23: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. కొమ్మంగి పంచాయతీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆమె హజరయ్యారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతీ గృహానికి వెళ్లి స్టిక్కర్లు అంటించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు పింఛన్లు రూ.4 వేలకు పెంచారన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్‌కుమార్, శ్రీను, ముర్ల బుజ్జిబాబు, సత్యనారాయణ, గసాడి రాజేశ్, కార్యదర్శి కొరుప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎగువశోభ పంచాయతీలో...

అనంతగిరి: ఎగువశోభ పంచాయతీ పరిధిలోని హెక్బాగుడ, మర్ధగుడ, దండబాడు, కొత్తవలస గ్రామాల్లో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.బాబీ, సిహెచ్.మురళీ, పి.భీమన్న, జి.రమేశ్, ఎ.జానకీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే కొండిబ పంచాయతీలో టీడీపీ సీనియర్ నేత దయానిధి, సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి స్టికర్లను అంటించారు.

అరకులోయ: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతోందని పెదలబుడు సర్పంచ్, టీడీపీ నేత పెట్టెలి దాసుబాబు అన్నారు. పంచాయతీ పరిధిలోని లిట్టిగుడ గ్రామంలో మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా దాసుబాబు మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో పంచాయతీల నిధులన్నీ దారిమళ్లించి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. ఈ స్థితిలో చంద్రబాబు అధికారంలోకి వచ్చి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

పేదల మన్ననలు పొందిన ప్రభుత్వం: ఎమ్మెల్సీ చిరంజీవి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 23: వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం పాలనలో పేద ప్రజల మన్ననలను పొందిందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. కురిడి పంచాయతీ జంగిడివలసలో ఎంపీడీవో ఉషారాణి అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా వేదికలో ఏడు గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సీఎం చంద్రబాబు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. నిరుద్యోగుల్లో వెలుగులు నింపేందుకు డీఎస్సీ భర్తీకి చర్యలు చేపట్టిందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర మాట్లాడుతూ ప్రజల కోసం బాధ్యతతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చన్న, ఎంపీటీసీ సభ్యురాలు శోభ, నాయకులు సుబ్బారావు, నాగేశ్వరావు, చిరంజీవి, దనేశ్వవరావు, స్వామి పాల్గొన్నారు.

సమస్యలపై కాఫీ కార్మికుల నిరసన



సమస్యలపై నినాదాలు చేస్తున్న కాఫీ కార్మికులు

పాడేరు రూరల్, సెప్టెంబరు 23: ఏజెన్సీ ప్రాంతాల్లో ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాఫీ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.సుందరరావు మాట్లాడుతూ మన్యంలో సాగు చేస్తున్న 10 వేల హెక్టార్ల పరిధిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి కనీస వేతనం చెల్లించకపోవడం విచారకరమన్నారు. గతంలో క్షేత్ర స్థాయి ఫీల్డ్ సిబ్బంది 300 మంది ఉండేవారని, ఉద్యోగ విరమణ చేసిన ఖాళీలను భర్తీ చేయకనపోవడంతో ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిందని చెప్పారు. అధికారులు ఏపీసీ వ్యవస్థను రద్దు చేసి క్షేత్ర స్థాయిలో ఖాళీగా ఉన్న సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐదు డివిజన్ల కాఫీ హెల్పర్లు సుందర్‌కుమార్, వెంకటేష్, దేవరాజ్, నాగేశ్వరరావు, కాంతారావు, బాలకృష్ణ, మోహన్, అప్పారావు, రామారావు, బాబూరావు, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని ఆందోళన


రహదారి నిర్మించాలని నినాదాలు చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 23: మండలంలో వనుగుమ్మ పంచాయతీ కిరంబో గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా సభ్యుడు కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామస్థులతో కలిసి ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామానికి పక్కా రహదారి లేదని, మట్టి రోడ్డు భారీ వర్షాలకు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏ చిన్నపాటి అవసరానికైనా పంచాయతీ, మండల కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పీఎం జన్‌మన్ ద్వారా పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.శంకరరావు, పి.భీమన్న, ఎస్.విక్రమ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గిరి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సిక్ రూమ్ నిర్వహణపై హెచ్‌ఎంలు, డిప్యూటీ వార్డెన్లకు శిక్షణ

త్వరలో జేసీ నేతృత్వంలో వైద్య పరీక్షల కమిటీ: కలెక్టర్ దినేశ్‌కుమార్


అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల్లోని గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. గిరిజన సంక్షేమ విద్యాశాఖపై కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చిన విద్యార్థులను డాక్టర్లు సక్రమంగా పరిశీలించకుండా డిశ్చార్జి చేస్తే, అనంతరం అనుకోని సంఘటన జరిగితే సంబంధిత వైద్యాధికారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు అస్వస్థత ఉంటే వెంటనే ఐటీడీఏకు సమాచారం అందించి, మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో చేరిన విద్యార్థి కోలుకున్న తరువాత ఆశ్రమ పాఠశాలకు పంపించాలని, ఇంటికి పంపించవద్దని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో వైద్య పరీక్షల కమిటీ ఏర్పాటు చేస్తామని, ఆశ్రమ పాఠశాలల్లో సిక్‌రూమ్ ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులకు వార్షిక వైద్య పరీక్షలు నిర్వహణకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల్లో ఒకే విధమైన వైద్య సేవలను విద్యార్థులకు అందించాలన్నారు. అనారోగ్యంగా ఉన్న విద్యార్థులను ఆస్పత్రికి తీసుకుని వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పెద్ద వాళ్లు కూడా వెళ్లాలని, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. గిరిజన విద్యార్థులకు హెల్త్ రికార్డులను నిర్వహించాలని, జ్వరం, బీపీ పరీక్షలకు అవసరమైన పరికరాలను ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేస్తామని, సిక్ రూమ్ నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు, డిప్యూటీ వార్డెన్లకు అవసరమైన శిక్షణ అందిస్తామన్నారు. ఆశ్రమాల్లో ఇటీవల జరిగిన మరణాలు, వైద్య శిబిరాల నిర్వహణ, సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రంపచోడవరం ఐటీడీఏ పీవో కె.సింహాచలం, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కె.కృష్ణారావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ సాధన, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు, ఏజెన్సీ మండలాలకు చెందిన ఏటీడబ్ల్యూవోలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పౌష్టికాహారం తీసుకోండి

- ఆరోగ్యంపై గర్భిణులు, బాలింతలకు శ్రద్ధ అవసరం
- ఐసీడీఎస్ రీజనల్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి


పోషకాహార మాసోత్సవాల్లో మాట్లాడుతున్న ఆర్‌డీ చిన్మయిదేవి, పీడీ సూర్యలక్ష్మి

పాడేరు రూరల్, సెప్టెంబరు 23: గర్భిణులు, బాలింతలు సకాలంలో పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ రీజనల్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి సూచించారు. మండలంలోని డి.గొందూరు సెక్టార్ పరిధిలో లగిశపల్లి, ఉగ్గంగొయ్యి గ్రామాల్లో సోమవారం పోషకాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గిరిజన ప్రాంత మహిళల్లో రక్తహీనత అధికంగా ఉంటుందన్నద, అందువల్ల ఆరోగ్యంపై గర్భిణులు, బాలింతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సొంతంగా పండించే పండ్లను అమ్మకుండా తినాలన్నారు. రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అప్పుడే పుట్టిన బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఆమె చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఆమె తిలకించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, సీడీపీవో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు కవిత, ఊర్మిళ, చెల్లాయమ్మ, రాజేశ్వరి, లక్ష్మి, లగిశపల్లి ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- కోల్పోయిన భూమికి ప్రత్యామ్నాయంగా కేటాయించాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి


గిరిజనులతో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

సీలేరు, సెప్టెంబరు 23: గిరిజన ప్రాంతంలో వరదల వల్ల భూములు, గృహాలు నష్టపోయిన ఆదివాసీలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల పరిధిలో ధారాపురం, మాదిగమల్లు, కమ్మరితోట, దార్లగొంది, తోకరాయి, నిమ్మచెట్టు గ్రామాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా 300 కుటుంబాలకు 25 కిలోల బియ్యం చొప్పున బియ్యం, నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. వరదలకు కొట్టుకుపోయిన భూములు, గృహాలను పరిశీలించి నష్టాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదల వల్ల ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు రూ.25 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారని, గిరిజన ప్రాంతంలో ఎక్కడా ఆదివాసీలకు పరిహారం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆర్వోఎఫ్ఆర్ భూములు నష్టపోయిన రైతులకు కూడా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీలేరు-జీకేవీధి ప్రధాన రహదారి వర్షాలకు పూర్తిగా పాడైపోయినా పునరుద్ధరించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. నేటికి బస్సు సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆదివాసీలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రవాణా సదుపాయం కల్పించాలని, భూమిని కోల్పోయిన గిరిజనులకు ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

జడ్పీలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

అచ్యుతాపురం బదిలీ చేసి...ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన వీఎస్ నాగేశ్వరరావుకు నియమించారు. కొత్తగా వచ్చిన వి.అప్పారావుకు వి.మాడుగుల ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. చింతపల్లి ఎంపీడీవో పి.ఆశాజ్యోతిని పాడేరు బదిలీ చేసి, ఆమె స్థానంలో కొత్తగా వచ్చిన ప్రేమ్‌సాగర్‌ను నియమించారు. పాడేరులో పనిచేస్తున్న కె.సాయినవీన్‌ను పొరుగు జిల్లాకు కేటాయించారు. జి.మాడుగుల ఎంపీడీవో లోహిత్‌సాగర్ మరో జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన తేజ్‌రతన్‌ను నియమించారు. అలాగే హుకుంపేట ఎంపీడీవో ఆర్.వెంకటరావు పొరుగు జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన టి.రమాదేవికి పోస్టింగ్ ఇచ్చారు. ముంచంగిపుట్టు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ ఇతర జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన ఎం.శ్రీసాయిహర్షను, పెదబయలు ఎంపీడీవో విగిన్ బక్కా ఇతర జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన కేవీ ప్రసాద్‌ను నియమించారు. కాగా పద్మనాభం (విజయకుమార్), అనకాపల్లి (కేవీ నరసింహరావు), కశింకోట (వీవీ రవికుమార్), కోటవురట్ల (జి.కాశీవిశ్వనాథరావు), రావికమతం (వెంకన్నబాబు), డుంబ్రిగుడ (ఎం.ఉషారాణి), గూడెంకొత్తవీధి (వై.ఉమామహేశ్వరరావు) ఎంపీడీవోలను అక్కడే కొనసాగించారు. అనంతగిరి ఎంపీడీవో స్టడీ లీవ్‌లో ఉండగా అక్కడ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మాకవరపాలెం, పెందుర్తిలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

సత్వరమే అట్రాసిటీ కేసుల పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా చికెన్, మటన్‌లతో వంటలు చేసి పెడుతున్నారని పలువురు కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ విద్యాశాఖ అధికారులు విధిగా సమావేశాలకు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, డీఆర్‌వో బి.పద్మావతి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ జి.జనార్దనరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో నాగరాజు, కమిటీ సభ్యులు, బాలుఅవేసా, సీహెచ్ లోహితాస్, ఎస్.రాజారావు, సీతారామ్, తదితరులు పాల్గొన్నారు

మిరియాల సాగు ఫలప్రదం

... 5వ పేజీ తరువాయి

చేసుకున్నారు. పన్నీరు-1, థేవం, శక్తి, మల్బార్ ఎక్సెల్, గిరిముండ, పన్నీరు-5, పీఎల్‌డీ-2 రకాలను దిగుమతి చేసుకొని ఏడాది కిందట ప్రయోగాత్మక సాగు ప్రారంభించారు. జాతీయ సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్(డీఏఎస్‌డీ) పథకం ద్వారా రూ.50 లక్షల నిధులతో ప్రయోగాత్మక సాగును శాస్త్రవేత్తలు ప్రారంభించారు.

ఆర్థోట్రాక్ టెక్నాలజీ ద్వారా మొక్కల అభివృద్ధి

సాధారణంగా మిరియాల మొక్కలు నాటిన మూడున్నర ఏళ్ల నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. ఆర్థోట్రాక్(చిగుర్ల ద్వారా మొక్కల అభివృద్ధి) టెక్నాలజీ ద్వారా అభివృద్ధి చేసిన మొక్కలు నాటుకున్న ఏడాదిన్నరకే దిగుబడి ప్రారంభమవుతుంది. ప్రస్తుతం పరిశోధన స్థానంలో పాలిహౌస్ నిర్మించి ఆర్థోట్రాక్ టెక్నాలజీ ద్వారా కేరళ నుంచి దిగుమతి చేసుకున్న ఏడు రకాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు.

దివంగత ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుకు ఘన నివాళి


కిడారి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న శ్రావణ్, టీడీపీ నేతలు

పాడేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు ఆరో వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక కిడారి ఘాట్‌లో ఆయనకు కుటుంబ సభ్యులు, టీడీపీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు గిరిజన ప్రాంతానికి చేసిన సేవలను అందరూ స్మరించుకున్నారు. ఆయన స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీకి, గిరిజన ప్రాంతానికి సేవలు అందిస్తానని, ఆయన ఆశయాన్ని కొనసాగిస్తానని టీడీపీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కిడారి సర్వేశ్వరరావు, సోమ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బాకూరు వెంకటరమణరాజు, పాండురంగస్వామి, కొమ్మా రమాదేవి, కమిడి సరోజ, తామర్ల సత్యనారాయణ, సాగర సత్యవతి, సాగర సుబ్బారావు పాల్గొన్నారు.

సివేరి సోమకు నివాళులు


సివేరి ఘాట్ వద్ద సోమకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అరకులోయ: అరకు మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ ఆరో వర్ధంతిని సోమవారం నిర్వహించారు. సోమ భార్య ఇచ్చావతి, కుమారుడు అబ్రహం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమ సమాధిని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గం నుంచి టీడీపీ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. సీవేరి సోమ, కిడారి సర్వేశ్వరరావు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఈ సందర్భంగా ఆ పార్టీ నేత, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ కొట్యాడ అప్పారావు, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, ఎస్‌కె రహ్మాన్ కొనియాడారు.

మన్యంలో భారీ వర్షం


పాడేరు మెయిన్ రోడ్డులో హోరున కురుస్తున్న వర్షం

పాడేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏజెన్సీలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తాజా వర్షానికి జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. గత మూడు రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా సాయంత్రం వేళల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురవడం పరిపాటిగా మారింది. అలాగే సోమవారం జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నాం మూడు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన ఎండ కాసింది. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం మొదలైంది. ప్రస్తుత వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

సీలేరు, ధారకొండల్లో కుండపోత

సీలేరు: గూడెంకొత్తవీధి మండలం సీలేరు, ధారకొండ పంచాయతీల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో ఈ ప్రాంతంలో మరలా భారీ వర్షాలు కురుస్తుండడంతో స్థానిక గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నెల 8వ తేదీన తీవ్ర వాయుగుండం ప్రభావానికి కురిసిన భారీ వర్షాలకు ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ, గాలికొండ పంచాతీల్లో భారీ కొండచరియలు, చెట్లు విరిగిగిపడి పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లిన సంఘటన నుంచి తేరుకోకుండానే మరలా భారీ వర్షాలతో ఈ ప్రాంతంలో ఏం ప్రళయం ముంచుకొస్తోందోనని గిరిజనులు భయాందోళనకు గురువుతున్నారు.

సంక్షిప్తంగా..

15లోగా సభ్యత్వ లక్ష్యం పూర్తిచేయండి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి

పాడేరు రూరల్, సెప్టెంబరు 23: జిల్లాలో వచ్చే నెల 15వ తేదీ నాటికి సభ్యత్వ లక్ష్యం పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వం చురుగ్గా సాగుతున్నదన్నారు. 8800002424 నంబర్‌కు మిస్‌కాల్, క్యూఆర్ కోడ్ ద్వారా సభ్యత్వం చేయించాలని సూచించారు. ప్రధాని మోదీ గిరిజన ప్రాంతాల్లో పీవీటీజీలకు జన్‌మన్ పథకం ద్వారా 65 వేల గ్రామాల్లో రహదారులు వేసేందుకు రూపకల్పన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు కురసా ఉమామహేశ్వరరావు, కూడా కృష్ణారావు, మఠం శాంతకుమారి, సల్లా రామకృష్ణ, పి.రవికుమార్, రాఘవేంద్రరావు, ఎంగోపాలపాత్రుడు, ఎస్.వేమనబాబు, ఎల్.బాస్కర్, టి.సత్యవతి, చినతల్లి, ఎన్.ఉమామహేశ్వరరావు, కె.వెంకటరమణ, గాసన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

పాడేరు రూరల్, సెప్టెంబరు 23: మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవాల నేపథ్యంలో అల్లూరి జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సోమవారం పాడేరు-విశాఖపట్నం ప్రధాన రహదారిలో స్పెషల్ పార్టీ పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలను చేపట్టారు. వాహనాలను పరిశీలించి అనుమానితుల వివరాలు సేకరించారు. వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించి విడిచిపెట్టారు.

సీలేరులో...

సీలేరు: జెన్‌కో చెక్‌పోస్టు వద్ద ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలను పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. మావోయిస్టులు ఉనికిని చాటుకునేందుకు హింసాత్మక సంఘనలకు పాల్పడతారన్న నిఘా వర్గాల హెచ్చరికలతో సరిహద్దుల్లో సీలేరు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చేపోయే వాహనాలను తనిఖీ చేయడంతో పాటు కొత్త వ్యక్తుల వివరాలపై ఆరా తీస్తున్నారు.

'యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి'

పాడేరు రూరల్, సెప్టెంబరు 23: టోకూరు పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి సూకూరు అప్పలకొండమ్మ మృతికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. విద్యార్థిని అనారోగ్యానికి గురైనపుడు యాజమాన్యం ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఇందుకు కారణమైన హెచ్‌ఎం, వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని కోరారు. విద్యార్థుల మరణాలను అరికట్టేందుకు వసతి గృహాల్లో పూర్తి స్థాయి వార్డెన్‌లు, హెల్త్ వర్కర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కృష్ణ, తనీశ్, దేవా, కుమారి, దొన్ను రాజు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

అరకులోయ, సెప్టెంబరు 23: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5, 7, 8, 9 తరగతులలో ప్రవేశాలకు రాష్ట్రస్థాయి తుది ఎంపిక పరీక్షలు సోమవారం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ పీఎస్‌ఎన్.మూర్తి తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు పి.రమేశ్, కోచ్‌లు కె.గణపతి, కె.రాజుబాబు, డి.కొండలస్వామి, ఎ.మాదవ్, ఎల్.సూరిబాబు, వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీలలో ఐదో తరగతికి సుమారు 58 మంది విద్యార్థులు, ఏడులో ఏడుగురు, ఎనిమిదిలో ఆరుగురు, తొమ్మిదో తరగతికి చెందిన పది మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

చింతపల్లి, సెప్టెంబరు 23: మావోయిస్టులారా వారోత్సవాలు ఎవరి కోసం.. అంటూ ఆదివాసీలు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్నవరం వారపు సంతలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. 'నిరాయుధులైన అమాయక గిరిజనులను కిరాతంగా చంపిన మీరు వీరులా? శూరులా? మీకు స్థూపాలు కట్టాలా?' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగించారు. అలాగే మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు ప్రదర్శించారు.

క్రీడల ప్రోత్సాహానికే పోటీలు

చింతపల్లి, సెప్టెంబరు 23: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో పనసల ప్రసాద్ అన్నారు. స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-1 మైదానంలో సోమవారం మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, రన్నింగ్, లాంగ్, హై జంప్ క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారిని వచ్చే నెల 16, 17 తేదీల్లో పాడేరులో నిర్వహించే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడనాయుడు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సాగిన రామరాజుపడాల్, హెచ్‌ఎం కుదుముల కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

30న కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా

పాడేరు రూరల్, సెప్టెంబరు 23: కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డైలీవేజ్ కార్మికుల రెగ్యులరైజేషన్‌కు ఈ నెల 30వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయం వద్ద కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్ట ప్రకారం ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.సుందరరావు, సర్వశిక్షాభియాన్ ఉద్యోగుల సంఘ నేత జయరాజు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యానికి మేలు

కొయ్యూరు, సెప్టెంబరు 23: బాలింతలు, గర్భిణులు పోషక విలువలతో కూడిన సమతుల ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని సీడీపీవో విజయకుమారి సూచించారు. అంతాడ పంచాయతీలో కొండలపైన ఎద్దుమామిడి, సింగదార, గంపరాయి, డేకురాయి, అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం పోషణ వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మూడేళ్ల లోపు పిల్లలకు ఇచ్చే బాలామృతం ప్రాముఖ్యత వివరించారు. సూపర్‌వైజర్ మహలక్ష్మి పాల్గొన్నారు.